క్లుప్తంగా

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

బొల్లాపల్లి: పచ్చిరొట్ట ఎరువుకు అవసరమైన విత్తనాలు రాయితీపై రైతులకు ఆయా సచివాలయాల్లో అందుబాటులో ఉన్నాయని ఏఓ ఎ.అంకారావు తెలిపారు. జనుము, జీలుగలు, పల్లిపెసర రాయితీపై పంపిణీ చేస్తున్నామన్నారు. ఒక్కొక్క రైతుకు 5 ఎకరాల వరకు సరిపడా, ఎకరాకు పది కిలోల వంతున, 50 శాతం రాయితీపై విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కావల్సిన రైతులు ఆయా సచివాలయాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది ద్వారా పొందవచ్చని తెలిపారు. అలాగే మండలంలోని చక్రాయపాలెం సచివాలయంలో రైతులకు గ్రామ సర్పంచ్ కె.లక్ష్మానాయక్ చేతుల మీదుగ పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు పంపిణీ చేశారు. 50 శాతం రాయితీపై జనుము, జీలుగ విత్తనాలు రైతులకు పంపిణీ చేశామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది కమలాకర్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో కృష్ణవేణి విద్యార్థుల ప్రతిభ



నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రకటించిన డిగ్రీ తృతీయ సంవత్సరం 5వ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు వర్సిటీ స్థాయి మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారని కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. బీకాం కంప్యూటర్స్ విభాగంలో 700 మార్కులకు గాను తమ విద్యార్థులు వై.అనూష 630, ఎస్.బాల అజయ్‌కుమార్ 627, ఎల్.రాకేష్‌నాయక్ 611 మార్కులు సాధించారని వివరించారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్ కె.నాసరయ్య, ప్రిన్సిపల్ నాతాని, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ డి.యోగేశ్వరరావు, ఎంఆర్‌కె సతీష్ బాబు, ఎస్‌డి. సర్దార్ జానీ హుస్సేన్ అభినందించారు.

రెండు ఆర్‌బీకేల్లో గ్రామ సభలు



నాదెండ్ల: నాదెండ్లలోని రెండు రైతు భరోసా కేంద్రాల్లో ఉదయం, సాయంత్రం కౌలు రైతుల గుర్తింపు కార్డులపై అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. వ్యవసాయాధికారి ఎ.హరిప్రసాద్, డీటీ అనురాధ పాల్గొన్నారు. రెండు ఆర్‌బీకేల్లో తొలిరోజు 40 మంది కౌలు రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి అర్హులైన కౌలు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన అనంతరం గుర్తింపు కార్డులు అందిస్తామన్నారు. ఈ కార్డుల వలన సాధారణ రైతులతో పాటు కౌలు రైతులకు బ్యాంకు రుణాలు, సబ్సిడీ పథకాల్లో లబ్ధి చేకూరుతుందన్నారు.

అమ్మ చేయూత చారిటబుల్ సంస్థ సేవలు అభినందనీయం

సత్తెనపల్లి: అమ్మచేయూత చారిటబుల్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ నాయకులు చింకా అంకమ్మరావు అన్నారు. క్యాలిబర్ జానీ మనవడు మహమ్మద్ షేహజాద్ స్కూల్‌లో జాయిన్ అయిన సందర్భంగా గురువారం పట్టణంలోని రైల్వే స్టేషన్, తాలూకా సెంటర్‌లో అన్నార్తులకు అమ్మ చేయూత చారిటబుల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంకమ్మరావు మాట్లాడుతూ అమ్మ చేయూత చారిటబుల్ స్వచ్ఛంద సంస్థకు దాతల సహకారం మరువలేనిదన్నారు. దాతల సహకారంతో మరెన్నో సేవా కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రెసిడెంట్ కె.దస్తగిరి, సభ్యులు పిక్కిలి రత్తయ్య, ప్రత్తిపాటి హరేకృష్ణ, కందుల అంబేడ్కర్, తోడేటి సుభాష్ చంద్రబోస్‌లు ఉన్నారు.

అర్హత కలిగిన కౌలు రైతులు దరఖాస్తు చేసుకోవాలి

సత్తెనపల్లి: భూమి కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్న కౌలు రైతులు పంట సాగు హక్కు పత్రాల (సీసీఆర్సీ కార్డులు) కోసం దరఖాస్తు చేసుకోవాలని గ్రామ రెవెన్యూ అధికారులు డి.మరియదాసు, ఎంటీ నాగేశ్వరరావు, కె.నాగమణి, జె.గోపి, ఎం.లలిత శివజ్యోతిలు అన్నారు. అర్హత కలిగిన కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలు మంజూరు చేయుటకు సత్తెనపల్లి మండలం అబ్బూరు, ఫణిదం-1, ఫణిదం-2, బట్లూరు, భీమవరం గ్రామాల్లో గురువారం నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కౌలు రైతులు దరఖాస్తు చేసుకున్న ఫారాలను ఆన్‌లైన్ చేసి మండలాధికారులకు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం అర్హులైన కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులను అందించడం జరుగుతుందన్నారు. ఆయా సమావేశాల్లో వ్యవసాయ శాఖ వీహెచ్ఏలు డి.వి.డి.పవన్‌కుమార్, బి.వెంకటేశ్వరరావు, మండూరి షేక్ షెహనాజ్, షేక్ చాందిని, జె.యాకోబు, కౌలు రైతులు, తదితరులు ఉన్నారు.

● ఆక్రమణలు తొలగాయ్!



ఆర్టీసీ బస్టాండ్ ఎదుట కుడివైపున డ్రెయినేజ్‌పై ఏర్పాటు చేసిన ఆక్రమణలను మున్సిపల్ అధికారులు తొలగించారు. వీటి గురించి సాక్షి దినపత్రికలో మంగళవారం నాడు 'వద్దు అన్నచోటే పాగా' అంటూ వచ్చిన కథనం మేరకు స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మున్సిపల్ కమిషనర్, పట్టణ ప్రణాళికా అధికారులతో కలిసి ఆర్టీసీ ప్రాంగణాన్ని బుధవారం సందర్శించారు. ఆక్రమిత ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించి డిపో పరిసరాల్లో ఎటువంటి ఆక్రమణలు ఉండరాదంటూ అధికారులను హెచ్చరించారు. ఈ మేరకు మున్సిపల్ పట్టణ ప్రణాళికా అధికారులు వెంటనే అక్కడ ఉన్న బంకులు, ఇతర వాణిజ్య సామగ్రిని తొలగించారు. దీనిపై ఆర్టీసీ ఉద్యోగులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

సాక్షి స్పందన

–నరసరావుపేట

ఉద్యోగుల ఆత్మగౌరవానికి సంకేతం రెవెన్యూ డే

- తహసీల్దార్ మొహమ్మద్ ఆఫ్రిపున్నీసా బేగం
- యడ్లపాడులో తొలి రెవెన్యూ దినోత్సవం
- సీనియర్ వీఆర్ఏకు ఘనసత్కారం



రెవెన్యూ డే సందర్భంగా సీనియర్ వీఆర్ఏను సత్కరిస్తున్న తహసీల్దార్ అఫ్రిపున్నీసాబేగం

యడ్లపాడు: సుదీర్ఘ పోరాటం తర్వాత సాధించుకున్న తొలి రెవెన్యూ డేను నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని తహసీల్దార్ మొహమ్మద్ అఫ్రిపున్నీసా బేగం పేర్కొన్నారు. గ్రామ వీఆర్వోల సంఘం ఆధ్వర్యాన యడ్లపాడు తహసీల్దార్ కార్యాయంలో రెవెన్యూ డే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రెవెన్యూ డే ఆ శాఖలో పనిచేసే ప్రతి ఉద్యోగి ఆత్మగౌరవానికి సంబంధించిందన్నారు. దీని సాధన కోసం రాష్ట్ర రెవెన్యూ సంఘం అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన అన్ని సంఘాలు సమిష్టిగా ఐదు దశాబ్దాలు పోరాటం చేసి ఏటా జూన్ 20న రెవెన్యూ డే నిర్వహించుకునేలా 2024 మార్చి 4న గత ప్రభుత్వం జీవోనెం :81 జారీ చేసిందన్నారు. రెవెన్యూ బోర్డు ఏర్పడిన తర్వాత తొలిసారిగా రెవెన్యూ డేను చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఏపీ వీఆర్వో రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కేపీ చారి మాట్లాడుతూ రైతు కళ్లలో నీళ్లు పొంగినా, ప్రజల ఇళ్లలో కష్టాలు చుట్టుముట్టినా నేనున్నానంటూ ముందు నిలిచేది రెవెన్యూ ఉద్యోగి మాత్రమేనని చెప్పడానికి సంతోషంగా ఉందన్నారు. 1786లో తొలిసారి రెవెన్యూ బోర్డు ఏర్పాటై రెవెన్యూ సేవలు ఆరంభమయ్యాయన్నారు. రెవెన్యూ అసోసియేషన్ కృషి ద్వారా సాధించుకున్న రెవెన్యూ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం సీనియర్ వీఆర్వో అల్లడి జోసెఫ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎస్.శ్యామలత, ఆర్ఐ ఎం చక్రవర్తి, మండల సర్వేయరు శ్రీనివాస్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు మోజేస్, బుజ్జిబాయి, ఆపరేటర్లు అనిల్, దివ్యా, సిబ్బంది అన్నిగ్రామాల సర్వేయర్లు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాల స్వామి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామివార్లు

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో కొలువైయున్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి వార్షిక వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారిని పట్టు వస్త్రాలతో అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పూజారి చిలకపాటి భరద్వాజ కల్యాణ క్రతువు నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు దంపతులు పీటలపై కూర్చుని కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు హాజరై పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. సాయంత్రం ఆలయంలో భజన, పారాయణలు నిర్వహించారు.

యోగాతో అన్ని రుగ్మతలు మాయం


కనపర్రు పాఠశాలలో విద్యార్థుల యోగాసనాల ప్రదర్శన



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

నాదెండ్ల /యడ్లపాడు: ఆధునిక జీవనశైలీలోని ప్రతి రుగ్మతకూ యోగాతో పరిష్కార మార్గం చూపుతోందని వైద్యనిపుణులు సైతం ఘంటాపథంగా వెల్లడిస్తున్నారు. నాదెండ్ల మండలం కనపర్రు గ్రామంలో గురువారం యోగాసనాల కార్యక్రమం జరిగింది. జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల పరిషత్ బీపీఆర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు వివిధ యోగ భంగిమలను అద్భుతంగా ప్రదర్శించారు. పాఠశాల ఉపాధ్యాయని వై.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో పిల్లలకు క్రమశిక్షణ, నైతిక విలువలతో విద్యను అందిస్తున్నారు. వారిలో నైతిక విలువలు పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధతో ధ్యానసిద్ధి, యోగసనాలు నేర్పిస్తున్నారు. తన సొంత ఖర్చులతో గుంటూరు, కోటప్పకొండ ప్రాంతాలకు సైతం విద్యార్థులను తీసుకువెళ్లి యోగ శిక్షణపై సమగ్ర శిక్షణ ఇస్తున్నారు. శుక్రవారం నిర్వహించే ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో యోగా ప్రదర్శన ఏర్పాటు చేశామని రాజ్యలక్ష్మి తెలిపారు. బాల్యదశ నుంచే యోగాధ్యానంపై పట్టుసాధిస్తే పిల్లల్లో ఇంద్రియ నిగ్రహం, శారీరక పటుత్వం వారి ఆధీనంలో ఉంచుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు ఎంతో ఆసక్తిగా తిలకించి, వాటిని నేర్పించిన ఉపాధ్యాయని రాజ్యలక్ష్మిని అభినందించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మలేరియా మాసోత్సవ ర్యాలీలో ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు

రాజుపాలెం: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా పర్యవేక్షకులు, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు అన్నారు. మండలంలోని కొత్తబోధనంలో పాఠశాల విద్యార్థులతో కలసి మలేరియా నివారణ మాసోత్సవ ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ మలేరియా వ్యాధి దోమల వలన ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి భాద్యత అని అన్నారు. ఇంటి పరిసరాలలో మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పరిసరాల లో ఉన్న రోళ్లు, పాత టైర్లలో నిల్వ ఉన్న నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని, సాయంత్రం వేళల్లో వేపాకు పొగ వేయడం వలన దోమలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాతవాల హెచ్ఎం లీలావతి, ఎంఎల్‌హెచ్‌పీ అన్నాకుమారి, ఏఎన్ఎం ప్రమీలాభాయి, ఆశా కార్యకర్తలు రెబ్బమ్మ, ఈశ్వరమ్మ, మద్దెమ్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల గుర్తింపు చట్టానికి సవరణ చేయాలి

ఎర్రబాలెం(క్రోసూరు): భూ యజమానులతో సంబంధం లేకుండా కౌలు రైతులను గుర్తించే విధంగా చట్ట సవరణ చేయాల్సిన అవసరం ఉందని కౌలు రైతు సంఘం ప్రతినిధులు కోరారు. గురువారం మండలంలోని ఎర్రబాలెం రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయాధికారి వేణుగోపాల్, తహసీల్దార్ ఎం.సువర్ణ ఆధ్వర్యంలో కౌలు కార్డులపై అవగాహన కార్యక్రమం జరిగింది.
ఈ సందర్భంగా పల్నాడు జిల్లా కౌలు రైతు సంఘం కమిటీ సభ్యులు తిమ్మిసెట్టి హనుమంతరావు మాట్లాడుతూ 2019లో కౌలు రైతు సాగుదారుల చట్టం అమలు చేస్తూ గ్రామాలలో కౌలు రైతు గుర్తింపు కార్డు పొందాలంటే భూ యజమానులు సంతకం చేయాలనే నిబంధన పెట్టటం వలన గ్రామాల్లో 20–30 శాతం మంది మాత్రమే కౌలు కార్డులు పొందారన్నారు. ఈ రకంగా కౌలు రైతులు కార్డు తీసుకునే దగ్గరే ఆగిపోవటం జరుగుతుందని వివరించారు.

నేను బడికిపోతా కార్యక్రమంపై అవగాహన



ఈపూరులో మాట్లాడుతున్న ఎంఈవో-1 జఫ్రుల్లా ఖాన్



శావల్యాపురంలో మాట్లాడుతున్న తహసీల్దారు లక్ష్మి లావణ్య

ఈపూరు: స్థానిక మండల వనరుల కేంద్రంలో నేను బడికి పోతా కార్యక్రమంపై ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలకు అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో-1 సయ్యద్ జఫ్రుల్లా ఖాన్ మాట్లాడుతూ 6 నుంచి 16 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న ప్రతి బాలబాలికలు అందరూ పాఠశాలల్లో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. అంగన్‌వాడీ వర్కర్స్, వెల్ఫేర్ అసిస్టెంట్స్, వలంటీర్ల సహాయంతో డోర్ టూ డోర్ సర్వే నిర్వహించి బడిఈడు పిల్లలందరూ బడిలో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. బడి ఉత్సవం, బాలికా ఉత్సవం, ప్రత్యేక బాలబాలికల ఉత్సవం, విద్యా సదస్సు, ఏ డే విత్ కమ్యూనిటీ, బ్యానర్ ద్వారా, పాఠశాల కమిటీ ద్వారా ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించడం, బాల్య వివాహాలను ఆపివేసేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

శావల్యాపురం: నేను బడికిపోతా కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారుల సమన్వయంతో విజయవంతం చేయాలని తహసీల్దారు నక్కా లక్ష్మి లావణ్య కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఐసీడీఎస్ అధికారులు, సచి వాలయ వేల్ఫేర్ ఉద్యోగులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ నేను బడికిపోతా కార్యక్రమం వచ్చే నెల 12 వరకు జరుగుతుందని ఇందులో మండలస్థాయి అధికారులు, ఎంపీడీవో, తహసీల్దారు,ఎంఈవో, ఐసీడీఎస్ అధికారులు సారథ్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి బడిబయట ఉన్న పిల్లలందరినీ బడిలో చేర్పించటానికి క్షేత్రస్థాయిలో కమిటీ సభ్యులు బాధ్యత వహించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వం అందించే సౌకర్యాలు పథకాలు తదితరవన్నీ పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి వారిలో చైతన్యం పెంపొందించాలన్నారు. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బడి ఈడు పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించాలన్నారు.
మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు ప్రతి రోజు మెనూ ప్రకారం జరగాలని లేని పక్షంలో అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు సంఖ్య పెంపుదల ప్రతి ఒక్కరు తమ శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంఈవో మద్దికుంట సాంబశివరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలలితా తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డులు మంజూరు

శావల్యాపురం: అర్హత కల్గిన ఉన్న వారందరికీ కౌలు రైతు కార్డులు అందజేయాలని తహసీల్దారు నక్కా లక్ష్మీ లావణ్య అన్నారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా గ్రామాల్లో విచారణ చేసి భూ యజమాని అనుమతితో కౌలు రైతులకు కార్డులను అందజేయాలన్నారు. కౌలు రైతు కార్డులు కల్గియున్న రైతులకు ప్రభుత్వ పరంగా ఎరువులు బ్యాంకు రుణాలు పొందడానికి అర్హత పొందుతారన్నారు. డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు ఉన్నారు.

ధ్రువీకరణ పత్రం విషయమై ఘర్షణ

బొల్లాపల్లి: విద్యార్థులకు ధ్రువీకరణ పత్రం జారీచేసే విషయంలో ఉపాధ్యాయుడికి, కాంప్లెక్సు సీఆర్పీకి ఏర్పడిన వివాదం చివరకు ఘర్షణకు దారితీసింది. బండ్లమోటు ఎస్సై డి.చెన్నకేశవులు కథనం ప్రకారం.. మండలంలోని గుమ్మనంపాడు గ్రామంలో ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు కాపర్తి మహమ్మద్ సుబాని, అదే కాంప్లెక్సు చెందిన సీఆర్పీ టి.ఇమామ్ షాహెబ్‌కు మధ్య విద్యార్థికి చెందిన కుల ధ్రువీకరణ పత్రం విషయంలో వివాదం ఏర్పడింది. ఇది ముదిరి చివరకు ఘర్షణకు దారితీసింది. తనపై సీఆర్పీ దాడికి చేశారంటూ ఉపాధ్యాయుడు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, సీఆర్పీతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతి

చిలకలూరిపేటటౌన్: గుర్తు తెలియని మహిళా మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. చిలకలూరిపేట మండలం తాతపూడి గ్రామ సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఓ మహిళ మృతి చెంది ఉండటాన్ని గురువారం స్థానికులు గుర్తించి తమకు సమాచారం అందించారన్నారు. ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించగా మృతురాలు గత నాల్గురోజులుగా ఆ చెట్టుకిందనే కూర్చొని ఉందని, బాటసారులు భోజనం అందించినట్లు తెలిసిందన్నారు. సదరు మహిళ నాల్గు రోజుల కిందటే చనిపోయి ఉండవచ్చని, స్థానికులు ఆమె యాచకురాలిగా భావిస్తున్నామని, సుమారు 65కు పైగా వయస్సు ఉండొచ్చని తెలిపారు. మృతురాలి వంటిపై పసుపు రంగు లోలంగా, నీలిరంగు చీర ఉన్నట్లు మ్యాచింగ్ జాకిట్ ధరించి ఉందన్నారు. జుట్టు పూర్తిగా నెరిసిపోయి ఉందని ఆచూకీ తెలిసిన వారు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

స్కూలు కిట్లతో మెరుగైన ఫలితాలు సాధించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు
- పెద్ద చెరువు పాఠశాలలో విద్యార్థులకు కిట్లు పంపిణీ



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట: విద్యార్థులు స్కూలు కిట్లను సక్రమంగా వినియోగించుకుని మెరుగైన ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు సూచించారు. గురువారం పట్టణం పెద్దచెరువు 25వ వార్డు జవహర్ మున్సిపల్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు స్కూల్ కిట్స్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెరుగైన విద్యను అందించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు ఎప్పుడు తొలి ప్రాధాన్యం ఇస్తారన్నారు. నాణ్యమైన విద్య అందించినప్పుడే సమాజం అభ్యున్నతి సాధిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత విద్యతో సమాజం కూడా మెరుగైన స్థితిలో ఉంటుందన్నారు. పార్టీ సీనియర్ నాయకులు సింహాద్రి యాదవ్, వార్డు ఇన్‌చార్జ్ కావూరి శ్రీనివాసరావు, జాస్తి బాబు, బోడపాటి బ్రహ్మయ్య, ఈదర శ్రీనివాసరావు, మహిళలు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి



గ్రాడ్యుయేషన్ డేలో చిన్నారులు, అంగన్‌వాడీలు

నాదెండ్ల: మూడేళ్లు నిండిన చిన్నారులను సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పి వారి ఉజ్వల భవితకు నాంది పలకాలని నాదెండ్ల సీడీపీవో శాంతకుమారి చెప్పారు. సాతులూరులోని పదకొండు అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో గురువారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అంగన్‌వాడీల్లోని 44 మంది చిన్నారులకు పత్రాలు అందించి వారిని సమీపంలోని ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించారు. ఐదేళ్లు నిండిన చిన్నారులందరకూ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చేందుకు తల్లిదండ్రులకు అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. 25 మంది చిన్నారులను సమీపంలోని అంగన్‌వాడీల్లో చేర్చారు. ప్రభుత్వం అంగన్‌వాడీల్లోని చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తుందన్నారు. రక్తహీనత కలిగిన బాలింతలను గుర్తించి వారిపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పద్మ, నిర్మల కృష్ణమాల, హెచ్ఎం హిదయతుల్లా, కార్యకర్తలు పాల్గొన్నారు.

నందిని ప్రియాయాదవ్‌కు డాక్టరేట్

- వర్షాభావాన్ని తట్టుకునే సజ్జ వంగడం అభివృద్ధి
- డాక్టరేట్ ప్రదానం చేసిన ఆచార్య ఎన్జీరంగా యూనివర్సిటీ



నాదెండ్ల: వర్షాభావ పరిస్థితులను తట్టుకుని అధిక దిగుబడులు అందించే సజ్జ విత్తనం వంగడం అభివృద్ధికై సాగించిన పరిశోధనకు నందిని ప్రియాయాదవ్ డాక్టరేట్ సాధించింది. బాపట్లలోని వ్యవసాయ యూనివర్సిటీలో నందిని ఏజీ బీఎస్సీ పూర్తి చేసింది. ఇటీవల ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సౌజన్యంతో హైదరాబాద్‌లోని ఐసీఏఆర్-ఐసీఎంఆర్ సంస్థల్లో పరిశోధనలు చేశారు. ఆమెకు గైడ్‌గా ప్రిన్సిపల్ సైంటిస్ట్ పి సంజనా రెడ్డి వ్యవహరించారు. ప్రియానందిని తండ్రి బీఆర్‌వీకే స్వామి కేంద్రియ విద్యాలయం (ఇర్లపాడు) ప్రిన్సిపల్‌గా పనిచేశారు. తల్లి పద్మకుమారి కేంద్రియ విద్యాలయంలో అధ్యాపకురాలు. నరసరావుపేటలోని ప్రకాష్‌నగర్‌లో నివాసం ఉంటున్న ప్రియానందిని మాట్లాడుతూ, తన వివాహానంతరం రాయలసీమలో స్థిరపడ్డానని, ఈ ప్రాంతంలో వర్షాభావం కారణంగా పంటల సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించానన్నారు. సజ్జ సాగులో వర్షాభావం ఎదుర్కొని అధిక దిగుబడులు ఇచ్చే వంగడం ఉత్పత్తికి రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో సజ్జ విత్తనాలను సేకరించి పరిశోధనలు సాగించినట్లు తెలిపారు.
ఈ ప్రాంత వాతావరణ పరిస్థితులను తట్టుకుని మంచి దిగుబడులిచ్చే వంగడాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. తన కృషిని గుర్తించి ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు వివరించారు. తనకు వెన్నుదన్నుగా తన భర్త ట్రైనీ తహసీల్దార్ మకర క్రాంతి కుమార్ నిలిచారన్నారు. డాక్టరేట్ సాధించిన నందిని ప్రియాయాదవ్‌ను పలువురు ప్రముఖులు అభినందించారు.

బస్‌షెల్టర్ నిర్మాణానికి భూమి పూజ



అచ్చంపేట: మండలంలోని పలు గ్రామాల నుంచి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీ ముందు బస్‌షెల్టర్ నిర్మాణానికి గురువారం భూమి పూజ నిర్వహించారు. సంస్థ ఫౌండర్, ప్రవాసాంధ్రులు ఎంవీ రావు భార్య రాజ్యలక్ష్మి, సంస్థ గౌరవ సలహాదారు మామిళ్లపల్లి విజయలక్ష్మిలు బస్‌షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన, భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో విద్యాభివృద్ధికి, సేవా కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. మండల కేంద్రమైన అచ్చంపేటలో బస్‌షెల్టర్ లేకపోవడం వల్ల దూరప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు, ఉన్నత విద్యకు వచ్చే విద్యార్థులు ఎండలకు, వానలకు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వారి అవస్థలు చూడలేక బస్‌షెల్టర్ నిర్మించాలని ఆలోచన చేశామన్నారు. 30 అడుగుల పొడవు, 15 అడుగుల వెడల్పుతో బస్‌షెల్టర్ నిర్మాణానికి రూ.5 లక్షలు అవుతుందని అంచనా వేసినట్లు చెప్పారు. గతంలో తమ సంస్థ ద్వారా రోకటిగుంటవారిపాలెం అడ్డరోడ్డు వద్ద, క్రోసూరు మోడల్ స్కూలు వద్ద బస్‌షెల్టర్స్ నిర్మించినట్లు చెప్పారు. నిరుపేద విద్యార్థులకు ఆసరాగా ఉంటూ, విద్యాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. అందుకు విద్యా శాఖ, స్థానిక పెద్దల సహాయ సహకారలు అందజేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఆర్.నరసింహారావు, వైద్యాధికారి డాక్టర్ రాజేష్, సంస్థ కో ఆర్డినేటర్ తాయి కరిముల్లాబాబు, చెరుకుంపాలెం గ్రామాభివృద్ధి సంఘ అధ్యక్షులు తుమ్మా శౌరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ నిర్వహణ



ముప్పాళ్ల: అంగన్‌వాడీ ప్రాజెక్టు సత్తెనపల్లి పరిధిలో గల ఇరుకుపాలెం సెక్టారులో దమ్మాలపాడు అంగన్‌వాడీ కేంద్రంలో ఐదేళ్లు నిండిన పిల్లలకు ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జి.విజయలక్ష్మి పాఠశాల హెచ్ఎం నాసరయ్య, ఉపాధ్యాయులు జి.ఆశాలత, అంగన్‌వాడీ కార్యకర్తలు టి.పద్మావతి, డి.బుజ్జిరాణి, టి.ప్రమీల, డి.రమాదేవి, సీహెచ్ సుమలత, ఎల్.శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
HYUNDAI i20 ASTA PETROL
2020 MODEL AP39 FB 0883
Engine No : G4LALM61633
Chassis No : MALBM51BLLM808386
Cell: 99631 48645
Door No : 9-6-23, 2nd Floor,
NARASARAOPET.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302
90102 03704 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com